
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 6 ఆగస్టు 2025 | 5



విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం...
కుటుంబానికి శాపం!
● మృతుడి పేరుతో 17 విద్యుత్ కనెక్షన్లు
● రేషన్‌కార్డు దరఖాస్తులో బట్టబయలు
● అందని ప్రభుత్వ పథకాలు 7



పుష్కర ఏర్పాట్లపై జరిగిన సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు, ఇతర అధికారులు

వచ్చే పుష్కరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి : కలెక్టర్

- జిల్లాస్థాయి అధికారుల సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశం
- పాల్గొన్న ఎస్పీ, జేసీ, ఆర్డీవోలు

అమలాపురం,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): 2027లో రానున్న పుష్కరాలకు భక్తుల కోసం స్నానఘట్టాల మరమ్మతులు, ఇతర మౌలిక వసతుల కల్పనపై నియోజకవర్గాల వారీగా ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలని కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రెవెన్యూ సహా ఇతర శాఖల అధికారులతో కలిసి పుష్కరాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన పనులు, మౌలిక సదుపాయాల కల్పనపై మంగళవారం సమీక్షించారు. జలవనరులశాఖ స్నానఘట్టాల అభివృద్ధికి, స్నానఘట్టాలకు అప్రోచ్ రోడ్లతోపాటు పిండ ప్రదానాల షెడ్లు, పుష్కర నగర్‌ల ఏర్పాటు, మహిళలు దుస్తులు మార్చుకునే షెడ్లు, దైవ దర్శనాలు, స్నానఘట్టాల వద్ద సీసీ కెమెరాలు వంటి వాటిపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం పుష్కరాల ఏర్పాట్లపై అన్నిశాఖల అధికారులతో సమీక్షించిన ఆయన 2015 నాటి పుష్కరాల భక్తుల తాకిడి, అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ఏర్పాట్ల నివేదికను సంబంధిత ఎమ్మెల్యేలు, డివిజన్ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, అందరి సూచనలు, అనుభవాలతో వీటిని సిద్ధం చేయాల్సిందిగా ఆదేశించారు. స్నానఘట్టాలను ఏబీసీలుగా విభజించి భక్తుల తాకిడికి అనుగుణంగా నివేదికలు రూపొందించే ఏర్పాట్లు చేయాలని, నదీతీర ప్రాంతంలో ఉన్న ప్రముఖ దేవాలయాల్లో దర్శన ఏర్పాట్లు, డార్మెటరీలతోపాటు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పుష్కరాలకు పదకొండు శాఖల అధికారులు నిర్దేశిత పారామీటర్ల వారీగా ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలని, కోనసీమలో పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి అన్నిశాఖల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, జేసీ నిషాంతి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, అఖిల తదితరులు పాల్గొని ఏర్పాట్లపై మాట్లాడారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, హాజరైన ఎస్పీ, జేసీ


ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు : కలెక్టర్

అధికారులకు దిశానిర్దేశం

అమలాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య వేడుకలను జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా ఏర్పాటుచేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంగళవారం ఆదేశించారు. అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా రూపుదిద్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలని, సెట్టింగులు ఏర్పాటుచేయడంతోపాటు వీఐపీలకు ప్రత్యేక సిట్టింగ్ గ్యాలరీ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు వినూత్న రీతిలో అందరినీ ఆకట్టుకునేలా ప్రదర్శనలు ఉండాలని, ముఖ్యంగా ఈ కార్యక్రమాలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, అతిథులకు స్నాక్స్ సౌకర్యం ఏర్పాటుచేయాలని, విద్యుత్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కళ్లకు కట్టేలా శకటాల ప్రదర్శన ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రికలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వారికి ప్రశంసాపత్రాలు అందించే కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జేసీ నిశాంతి, ఎస్పీ కృష్ణారావు, ఇన్‌చార్జి డీఆర్వో, ఆర్డీవో మాధవి పాల్గొన్నారు.

'పేదరికం లేని ఏపీని సాధించాలి..'

స్వర్ణాంధ్ర 2047 దార్శనిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పేదరికం లేని రాష్ట్రంగా చేయాలన్న లక్ష్యాన్ని నెరవేర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పీ-4 కార్యక్రమ అమలుతీరుపై దాతలు, ప్రజల భాగస్వామ్యంతో ఏవిధంగా చేపట్టాలనే అంశంపై దిశానిర్దేశం చేశారు. ఈనెల 19 నాటికి రాష్ట్రంలో 15లక్షల బంగారు కుటుంబాలను చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్లకు సూచించారు. సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్‌తోపాటు సీపీవో మురళీకృష్ణ పాల్గొన్నారు.



బార్లకు లాటరీ..

ముందడుగు!

వచ్చే నెల ఒకటి నుంచి కొత్త బార్‌లు

మద్యం బార్ల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీకి రూపకల్పన చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో 2022-25 మధ్య అమలైన మద్యం బార్‌ల పాలసీ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం బార్‌ల పాలసీ అమలుకు గ్రీన్‌సిగ్నల్ పడింది. ముందస్తుగా ఈ పాలసీ అమలుకు రాష్ట్రంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి ఆ ఉపసంఘం ఇచ్చిన అధ్యయన నివేదిక ఆధారంగా కొత్త బార్ల పాలసీ అమలుకు శ్రీకారం చుట్టనుంది.ఈ పాలసీలో భాగంగా గీత కార్మికులకు 10 శాతం షాపులు కేటాయించనున్నారు.

(రాజమహేంద్రవరం/ అమలాపురం -ఆంధ్రజ్యోతి)

కొత్త బార్ పాలసీపై అబ్కారీ శాఖ దాదాపుగా కసరత్తు పూర్తి చేసింది. త్వరలో కొత్త బార్‌లకు నోటిఫికేషన్ వెలువడనుంది. జగన్ హయాంలో ఇచ్చిన బార్‌ల లైసెన్స్‌లకు ఈ నెలాఖరుతో కాల పరిమితి ముగుస్తుంది. దీంతో ఈనెల 15వ తేదీలోగా కొత్త బార్‌లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్‌లు అందుబాటులోకి రానున్నాయి. మద్యం దుకాణాల కేటాయింపులో గీతకార్మికులకు ప్రభుత్వం 10 శాతం షాపులు కేటాయించింది. వీరికి లైసెన్స్ ఫీజు సైతం భారీగా తగ్గించింది. త్వరలో బార్ల లైసెన్సుల్లోను పది శాతం కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించింది.

దుకాణాల్లో ధరలకే

జగన్ హయాంలో బార్‌లలో ధరలను బార్లా తెరిచేశారు. అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారం ధరలు పెంచుకోవచ్చని జీవో ఇవ్వడంతో అడ్డూ అదుపూ లేకుండా మందుబాబుల జేబులను గుల్ల చేశారు. వైసీపీ ప్రభుత్వం ఒకవైపు మద్యం ధరలను నూరుశాతం పెంచగా, బార్‌లలో దానిపై మరింత అదనంగా లాగేశారు. క్వార్టరుకు రూ.50-రూ.70, బీర్‌కి ఏకంగా రూ.100-రూ.120 తీసుకుంటూ దోపిడీ చేశారు. ఐదేళ్లూ ఈ దందా సాగింది.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ దోపిడీకి కొత్త మద్యం పాలసీతో అడ్డుకట్ట వేసింది. బార్‌లలో కూడా దుకాణాల్లో ధరలనే అమలుచేయాలని నిర్ణయానికి వచ్చింది. దుకాణాల కంటే 10 శాతం ఎక్కువ ధర చెల్లించి బార్‌లు ప్రభుత్వ మద్యం డిపోల నుంచి కొనుగోలు చేస్తాయి.బార్‌లలో కూడా దుకాణాల ధరే నిర్ధారిస్తే ఆ శాతాన్ని ప్రభుత్వం నష్టపోవాల్సి ఉంటుంది. దరఖాస్తు రుసుం రూ.5 లక్షలు ఉంటుందని చెబుతున్నారు.

పర్మిట్ రూంలు కూడా

జగన్ జమానాలో పిచ్చి బ్రాండ్లతో ఎంత ఆదాయం వచ్చిందో.. ఇప్పుడు దాదాపు 200 రకాల నాణ్యమైన బ్రాండ్లు ఉన్నా అంతే రాబడి నమోదవుతోంది. బీర్లలో పెరుగుదల కనిపిస్తే ఆ మేరకు మిగతా మద్యం బ్రాండ్లలో తరుగుదల నమోదవుతోంది.దీంతో ఆదాయం ఆశాజనకంగా ఉండడం లేదు. దీనిపై ప్రభుత్వం విశ్లేషణ చేయగా పర్మిట్ రూమ్‌లు లేకపోవడమే ఒక కారణమని తేలింది. ప్రస్తుతానికి అనధికారిక సిట్టింగ్‌లను చూసీచూడనట్టు వదిలేస్తున్నా.. ఆదాయం మెరుగుపడడం లేదు.బార్‌ల లైసెన్స్‌ల మాదిరిగానే పర్మిట్ రూంలకు ఈ సెప్టెంబరు నుంచి అనుమతులిచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది.ఉమ్మడి జిల్లాలో 452 మద్యం దుకాణాలు ఉన్నాయి. 2019కి ముందు అన్ని షాపులకు ఏడాదికి రూ.5 లక్షలు ఫీజుగా ఉండేది. ఇప్పుడు దానిని రెండు కేటగిరీలుగా చేయనున్నారు.మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.7.5 లక్షలు, మిగతా ప్రాంతాల్లో రూ.5 లక్షల ఫీజు విధించే అవకాశం ఉంది. ఉమ్మడి తూర్పులో కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లు కాగా.. మిగతావి మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. బార్‌లు, పర్మిట్ రూంలకు ఒకేసారి నోటిఫికేషన్ ఇస్తారా? లేదా వేర్వేరుగా విడుదల చేస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

మద్యం షాపుల తరహాలోనే బార్లకు లాటరీ తీయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జగన్ హయాంలో వేలం విధానంలో రెండేళ్ల పరిమితికి జారీ చేసిన లైసెన్స్‌లను గడువు ఈ నెల 31వ తేదీతో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త బార్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. లైసెన్స్ ఫీజుల నిమిత్తం రెండు ప్రతిపాదనలను ఎక్సైజ్ శాఖ సిద్ధం చేసింది. నగర పంచాయతీల్లో రూ.35 లక్షలు, మునిసిపాలిటీల్లో రూ.40 లక్షలు, నగరపాలక సంస్థల పరిధిలో రూ.45 లక్షలు మొదలు ప్రతిపాదన కాగా.. వరుసగా రూ.55 లక్షలు, రూ.65 లక్షలు, రూ.75 లక్షలు రెండో ప్రతిపాదనగా ప్రభుత్వం ముందుంచింది. అయితే ఖచ్చితంగా ఒక్కొక్క బారుకు నాలుగు దరఖాస్తులు పడాల్సిందేనన్న నిబంధన ఉంది. ప్రభుత్వం మొదటి ప్రతిపాదనకు మొగ్గు చూపుతుండగా ఆదాయం తగ్గుతుండడంతో ఏంచేయాలో ప్రశ్నార్థకంగా మారింది.ఆ అంతరాన్ని పూడ్చడానికి బార్‌ల సంఖ్య పెంచాలని భావిస్తున్నారు.ప్రస్తుతం తూర్పుగోదావరిలో 20, కాకినాడ జిల్లాలో 13, కోనసీమ జిల్లాలో 10 కలిపి మొత్తంగా 43 బార్లు ఉన్నాయి.ఈ సంఖ్య 60కి పెరిగే అవకాశం ఉంది.

- లాటరీ విధానంలో కేటాయింపు
- 10 రోజుల్లో నోటిఫికేషన్ విడుదల
- ఉమ్మడి జిల్లాలో 60 బార్లు
- దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు?
- బారుకు 4 దరఖాస్తులు తప్పనిసరి
- లైసెన్స్ ఫీజు రూ.45 లక్షలు
- మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులు
- పర్మిట్ రూంలకు అవకాశం
- ఈ నెల 31తో బార్ల గడువు ముగింపు

నాడంతా 'బార్లా'

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో బార్ లైసెన్సుల జారీకి సిద్ధమవుతోంది. బహిరంగ వేలం ద్వారా కోట్లలో ఆదాయం వచ్చే ఛాన్స్ ఉన్నా అదేదీ కాదనుకుని లాటరీ ద్వారా బార్ల జారీకి సన్నాహాలు చేస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం బార్ల కేటాయింపులో అడ్డగోలుగా వ్యవహరించింది. భారీ అప్‌సెట్ ధరలను నిర్ణయించి వ్యాపారుల మధ్య పోటీ పెంచింది. అదే సమయంలో అప్పటి అధికార పార్టీ నేతలు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేశారు. బార్ల వ్యాపారులను సిండికేట్ చేసి వారి నుంచి తక్కువ ధరకు కోట్ చేయించి తద్వారా వారి నుంచి లాగేశారు. తద్వారా పోటీ లేకుండా తక్కువ ధరకే వైసీపీ అనుకూల వ్యాపారులు 2022 నుంచీ బార్లు నిర్వహిస్తూ భారీగా సంపాదిస్తున్నారు. గతంలో ఒక్కో బార్‌కు ప్రభుత్వం రూ.35 లక్షల ప్రారంభ ధర నిర్ణయిస్తే ఏరియా ఆధారంగా వేలంలో రూ.కోటికిపైగా పలకాల్సింది. కానీ నేతలు, వ్యాపారులు సిండికేట్ అయి అప్‌సెట్ ధరకు పది శాతం కూడా అదనంగా రాకుండా చేసి ఉమ్మడి జిల్లాలో అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధులు భారీగా సంపాదించారు. ఒక్క కాకినాడ జిల్లాలో 15 బార్లకు వేలం నిర్వహించారు. ఒక్క కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 11 బార్‌లను తక్కువ ధరకు లాగేసుకున్నారు. పోటీ పెరగకుండా ఉండేందుకు పదకొండు బార్‌లకు పద్దెనిమంది బరిలో ఉంటే అప్పటి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఏడుగురిని దారికి తెచ్చారు. వేలం నుంచి పోటీదారులను తప్పించి ఒక్కో బార్‌కు రూ.35 లక్షల ప్రారంభ ధరగా ప్రభుత్వం నిర్ణయిస్తే కేవలం రెండు లక్షలే అదనంగా వేసి రూ.37 లక్షలకు కోట్ చేశారు. తద్వారా భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది.



కేశవదాసుపాలెం-చింతలమోరి మధ్య శంకరగుప్తం డ్రెయిన్‌పై ఉన్న స్ట్రయిట్ కట్

ముంపునీరు తొలగింపునకు ఎత్తిపోతలే పరిష్కారం

- ఆ దిశగా ఎమ్మెల్యే దేవ ప్రయత్నాలు
- ఇప్పటికే డ్రెయిన్ సమస్యపై కొంత కృషి

మలికిపురం,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో 14 వేల ఎకరాల రిజిస్టర్ ఆయకట్టు ఉండగా, ముంపు నీరు వెళ్లే మార్గం లేక కేవలం మూడు వేల ఎకరాలు మాత్రమే రైతులు సాగుచేస్తున్నారు. వర్షం, వరదలు తదితర ముంపు నీటిని గతంలో డ్రెయిన్ల ద్వారా శంకరగుప్తం డ్రెయిన్‌లోకి వెళ్లేవి. శంకరగుప్తం డ్రెయిన్ ఎగదన్నడంతో ముంపునీరు చేల నుంచి దిగకపోవడంతో రైతులు సార్వా పంటకు క్రాప్‌హాలీడే ప్రకటించుకుంటున్నారు. దాళ్వా పంటకు వచ్చేసరికి అనుకున్న స్థాయిలో వరినాట్లు వేయడం లేదు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఎలాగైనా నియోజకవర్గంలో 10 వేల ఎకరాలకు వ్యవసాయాన్ని పెంచాలనే తలంపుతో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గోగన్నమఠం డ్రెయిన్ ఆక్రమణలను చాలావరకు తొలగించారు. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ కూడా కొంతమేర డ్రెడ్జింగ్ కాగా, మిగిలిన ప్రాంతం రూ.9 కోట్లతో డ్రెడ్జింగ్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా ఆర్థికశాఖ వద్ద ఆగినట్టు తెలిసింది. అయినప్పటికీ చేలల్లోని ముంపునీరు మోటార్ల ద్వారా శంకరగుప్తం డ్రెయిన్‌లోకి తోడి ఆ నీటిని చింతలమోరి-కేశవదాసుపాలెం మధ్యనున్న స్ట్రయిట్‌కట్ ద్వారా సముద్రంలోకి పంపడానికి తాజాగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం ఇరిగేషన్, డ్రెయిన్స్, ఏపీఐడీసీ అధికారులను తీసుకువచ్చి ఎమ్మెల్యే దేవ పరిశీలన చేయించారు. ఏపీఐడీసీ ద్వారా ముంపు నీటిని ఎత్తిపోయడానికి భారీ బడ్జెట్ చేపట్టడంతో డ్రైనేజీ విభాగం ద్వారా ఉప్పలగుప్తం మండలం రామేశ్వరం మొగ నుంచి ముంపు నీటిని పంపే విధంగా చింతలమోరి కేశవదాసుపాలెం మధ్య ఆ విధంగా ముంపునీటిని పంపే ఏర్పాట్లకు డ్రైనేజీ శాఖతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. 45 రోజులపాటు 10 మోటార్ల ద్వారా ఈ ముంపు నీటిని డ్రెయిన్‌లోకి మళ్లిస్తే ఎమ్మెల్యే లక్ష్యం నెరవేరుతుంది. బీడు బారిన భూములకు కళ వస్తుంది. ఎమ్మెల్యే ప్రయత్నం సాకారం కావాలని నియోజకవర్గంలోని రైతులు కోరుతున్నారు.

నిధులు మంజూరుకు కృషి : ఎమ్మెల్యే

ప్రతీ ఏటా 45రోజులపాటు మోటార్ల ద్వారా ముంపునీటిని డ్రెయిన్‌లోకి తోడడానికి సీఎస్సార్ నిధులు మంజూరుచేయమని కలెక్టర్‌ను కోరినట్టు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ చెప్పారు. ఏటా రూ.16 లక్షలు ఖర్చుపెడితే రూ.10వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెంచవచ్చని చెప్పారు.





ఆసుపత్రి హాలులోనే నిల్వచేసిన మందుల ప్యాకెట్లు

ఔషధాలకు భద్రత ఏదీ?

- ఆసుపత్రి హాలులోనే సీఎస్‌ఆర్ మందుల నిల్వలు
- భద్రతకు తావులేదని ఫార్మాసిస్టు ఆందోళన
- గది నిర్మించి మందులకు భద్రత కల్పించాలని వైద్యుల వినతి

ఉప్పలగుప్తం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): 'స్టోర్ ఇన్ ఏ కూల్ ప్లేస్.. అవే ఫ్రమ్ హీట్.. ప్రొటెక్ట్ ఫ్రమ్ డైరెక్ట్ లైట్ అండ్ మాయిశ్చర్..' ప్రతి ఔషధంపై ఉండే హెచ్చరిక ఇది. అయితే ఈ హెచ్చరికలు, నిబంధనలు, ఎస్.యానాం ఆసుపత్రిలో చెల్లవు. ప్రాణాలకు రక్షణ కల్పించే ఔషధాలకు అక్కడ భద్రత కరువైంది. మందులను ఆసుపత్రి హాలులోనే నిల్వచేసి ఉంచుతున్నారు. మందులను అలా వెలుతురులో, జనం అటూఇటూ తిరిగే చోట ఉంచితే పరిస్థితి ఏంటి? ఆసుపత్రి వైద్యులు, ఫార్మాసిస్టు ఈ విషయంపై ఆందోళన చెందుతున్నారు. ఎస్.యానాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జిల్లాలో మిగిలిన ఆరోగ్య కేంద్రాలకంటే భిన్నంగా ఉంటుంది. ఇక్కడ ఇద్దరు ప్రభుత్వ వైద్యులతోపాటు మరో ఇద్దరు వైద్యులను స్థానిక రవ్వ యాజమాన్యం నియమించింది. సీఎస్‌ఆర్ నిధులతో కొంతమంది సిబ్బంది నియామకంతోపాటు మూడు నెలలకోసారి రూ.7 లక్షల విలువైన మందులను బయట కొనుగోలుచేసి ఇస్తారు. ఆసుపత్రి భవనంలో రెండు ఓపీ గదులు, ల్యాబ్ రూమ్, ఆఫీస్ రూమ్, సిబ్బంది రూమ్, డ్రస్సింగ్ రూమ్, రోగ నిర్ధారణ పరీక్షల రూమ్, ఫార్మసీ రూమ్, ప్రభుత్వ మందులు భద్రపరిచేందుకు ఒక రూమ్, రోగులకు పడక గదులు ఉన్నాయి. ఓపీ చీటీలు హాలులోనే ఇస్తారు. ప్రతి రోజూ 100 పైబడి ఓపీ ఉంటుంది. ప్రభుత్వం ద్వారా సరఫరా అయ్యే మందులను ఒక చిన్నగదిలో నిల్వ ఉంచుతున్నారు. ఇక సీఎస్‌ఆర్ మందులు నిల్వచేసేందుకు ఆసుపత్రి హాలే శరణ్యం. ఒక మందుల ప్యాకెట్ తెరిచి కొన్ని మందులు తీసుకున్న అనంతరం మిగిలిన వాటిని ఎక్కడ ఉంచాలనే ఆలోచనతో ఫార్మాసిస్టు సతమతమవుతున్నారు. సీఎస్‌ఆర్ ద్వారా ఆసుపత్రికి విడుదల చేసే సామగ్రి, మందులకు ప్రత్యేక గది నిర్మించాలని గతంలోనే ఆలోచన చేశారు. అది అమలుకాలేదు.



అల్లవరం మండలం బోడసకుర్రు టిడ్కో భవనాల వద్ద జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సందర్శన

బోడసకుర్రు టిడ్కో భవనాలను సందర్శించిన కలెక్టర్

అల్లవరం ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండల పరిధిలోని బోడసకుర్రు టిడ్కో భవనాల వద్ద సమస్యలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఆర్డీవో కె.మాధవి మంగళవారం ఆకస్మికంగా ఆ ప్రాంతాన్ని సందర్శించారు. టిడ్కో భవనాల లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, శానిటేషన్ తదితర సమస్యలపై ఆయన చర్చించారు. అమలాపురం మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, అల్లవరం తహశీల్దార్ వీవీఎల్ నరసింహం, ఎంపీడీవోలు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ మాస్టర్ ప్లాన్‌కు అనుమతి

ముమ్మిడివరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీకి మాస్టర్ ప్లాన్‌కు అనుమతిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి గతంలో పంపించిన ప్రతిపాదనలకు మున్సిపల్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ పరిశీలించి వాటి ఆమోదానికి పురపాలకశాఖకు సిఫార్సు చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ మాస్టర్ ప్లాన్‌కు అనుమతిస్తూ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ 152 జీవోను విడుదల చేశారు. నగర పంచాయతీ పరిధిలో 54.42 చదరపు కిలోమీటర్లలో మాస్టర్ ప్లాన్ అమలు కానుంది. భవన నిర్మాణాలు, లేఅవుట్లకు సంబంధించి మాస్టర్ ప్లాన్‌కు లోబడి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. మాస్టర్ ప్లాన్ గతంలో జారీచేసిన జీవో నంబరు 119, 275కు అనుగుణంగా అమలు చేస్తారు.

అయినవిల్లిలో వినాయకచవితి ఘనంగా నిర్వహించాలి

అధికారులతో జేసీ నిషాంతి సమీక్ష



వివిధ అంశాలపై సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి వివిధ శాఖల అధికారులతో వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు. అయినవిల్లిలో శ్రీసిద్ధివినాయకస్వామి వినాయక చతుర్థి నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని జేసీ నిషాంతి దేవదాయ, ధర్మాశాఖ అధికారులను ఆదేశించారు. ఎండోమెంట్‌తోపాటు రెవెన్యూ, వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన ఆమె నవరాత్రి వేడుకల ముందస్తు ఏర్పాట్లు, భక్తుల రద్దీకి అనుగుణంగా చేపట్టాలని సూచించారు. విగ్రహాలను మట్టితో తయారుచేసేలా చర్యలు చేపడుతూ అన్నిరకాల అనుమతులు తీసుకుని ఏకగవాక్ష విధానంలో వేడుకలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నందున క్యూలైన్ల వద్ద భక్తులు తడవకుండా ఏర్పాట్లు చేయడంతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఊరేగింపులు, నిమజ్జనాల సమయంలో బాణసంచా కాల్చకుండా నియంత్రణ విధించాలని జేసీ ఆదేశించారు. ఆర్టీసీవారు ప్రత్యేక బస్సు సదుపాయం కల్పించాలని సూచించారు.

అంతర్వేది ఆలయ భూముల రీసర్వే..

సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం భూముల రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు. ఆలయ భూములకు సంబంధించి 895 ఎకరాల్లో 139 ఎకరాలు దేవస్థానం అధీనంలోనే ఉందని, ఇప్పటివరకు 211 ఎకరాల్లో సర్వే పూర్తి అయిందని, సరిహద్దుల్లో రాళ్లు ఏర్పాటుచేయాలని, ఆక్రమణల తొలగింపునకు నోటీసులు ఇచ్చి 15 రోజుల్లో చట్టప్రకారం తొలగించాలని సూచించారు. నిర్ణీత కాల వ్యవధిలోగా సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. ఆర్డీవో కె.మాధవి, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ముఖహాజరు నమోదుచేయాలి

జలవనరులశాఖకు చెందిన ఇంజనీర్లు ముఖ ఆధారిత హాజరు నమోదుతోపాటు సమయపాలన పాటిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని లేనిపక్షంలో కఠినచర్యలు తీసుకుంటామని జేసీ నిషాంతి హెచ్చరించారు. ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఇచ్చిన ఆదేశాల మేరకు ఇరిగేషన్, డ్రైనేజీ ఇంజనీర్ల పనితీరుపై సమావేశం నిర్వహించారు. అనంతరం జేసీ సమీక్షించారు.



ఫసల్ బీమాతో...


రైతులకు ధీమా

రూ.76 ప్రీమియం చెల్లిస్తే రూ.38వేలు బీమా... ఈ నెల 15 వరకు గడువు

అమలాపురం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) రైతు నష్ట నివారణకు దోహద పడుతుంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి అందేవరకు అన్నదాతలకు ఆందోళన తప్పట్లేదు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం అమలు చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలతో పంటకు నష్టం వాటిల్లితే రైతులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా బీమా వర్తించేలా ఈ పథకాన్ని రూపొందించినట్టు వ్యవసాయ శాఖ అమలాపురం డివిజన్ సహాయ సంచాలకుడు కెనడీ, మండల వ్యవసాయాధికారి క్రెప్రవీణ్ తెలిపారు. వరి పంటకు సంబంధించి బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూ.76 ప్రీమియం చెల్లిస్తే చాలు..

- ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు పీఎంఎఫ్‌బీవై పథకం కింద రూ.76 ప్రీమియంగా చెల్లిస్తే రూ.38వేలు బీమా వర్తిస్తుంది.
- పంట ముంపు బారిన, చీడపీడల బారిన పడ్డా, తుఫాన్లు వంటి ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయినా ఫసల్ బీమా వర్తిస్తుంది.
- పంటకోసి పనలపై ఉన్నప్పుడు అకాల వర్షాలు, వరదలు, తుఫాన్లు కారణంగా పంట దెబ్బతిన్నా బీమా వర్తింపజేస్తారు.
- పంట ముంపు బారిన పడితే 48 గంటల్లోగా సంబంధిత బ్యాంకులతో పాటు వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలి.
- గ్రామం యూనిట్‌గా నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లిస్తారు.
- బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులే ప్రీమియం చెల్లించి బీమాను వర్తింపచేస్తాయి.
- రుణం తీసుకోని రైతులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్, పోస్టాఫీసు ద్వారా ప్రీమియం చెల్లించి రసీదు పొందవచ్చు.
- ఇందుకోసం హెల్ప్ లైన్ నెంబరును ప్రకటించారు. టోల్‌ఫ్రీ నెంబరు 1800-209-3536, ఎన్‌సీఐపీ హెల్ప్‌లైన్ నెంబరు 14447కు సమాచారం అందించి వివరాలు తెలుసుకోవచ్చు.



నవీకరణలో తపాల శాఖ మరో మైలురాయి చేరుకుంది. కంప్యూటర్ అనుసంధానం, డిజిటలైజేషన్, ఇండియన్ పోస్ట్ పేమెంట్‌తో ముందుకు సాగుతుండగా తాజాగా మరో అడుగు ముందుకు వేసింది. సొంతంగా ఎ.పి.టి 2.0 (అడ్వాన్స్‌డ్ పోస్టల్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ)ని రూపొందించుకుంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించగా సత్ఫలితాలు రావడంతో దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా అన్ని పోస్టాఫీసుల్లోనూ ఆధునికీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.



పోస్టల్ సేవలు...

ఇంటి నుంచే!

(అమలాపురం టౌన్/మండపేట-ఆంధ్రజ్యోతి)

భారతీయ తపాలా శాఖ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సేవలను మరింత విస్తృతం చేసింది. ఇంటి వద్ద నుంచే పోస్టల్ సేవలు పొందే అవకాశం కల్పించింది. ఇప్పటికే గ్రామీణ స్థాయిలో బ్యాంకింగ్ రంగంలో దూసుకుపోతోంది. ఇకపై ప్రఖ్యాత డోర్ డెలివరీ సంస్థలు అయిన ప్రైవేటు ఈ-కామర్స్‌తో పోటీపడుతూ తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో డోర్ డెలివరీకి శ్రీకారం చుట్టింది.

తపాలా శాఖ న్యూ జనరేషన్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ పోస్టల్ సేవలను ఖాతాదారులకు అందుబాటులోకి తెచ్చింది. అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ-2.0) సేవలను జిల్లాలోని అన్ని తపాలా కార్యాలయాలకు అనుసంధానం చేశారు. ప్రస్తుతం తపాలా సేవలన్నీ నూరు శాతం వెబ్ ఆధారిత క్లౌడ్ టెక్నాలజీతో అనుసంధానం చేశారు. ఏపీటీ 2.0 విధానంలో అత్యాధునికంగా జరుగుతున్న సైబర్ నేరాలను నియంత్రించడంతో పాటు వాటిపై ఎప్పుడూ నిఘా కొనసాగుతూనే ఉంటుంది.

ఐఎంపఏ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుంటే చాలు..

వినియోగదారులు, ఖాతాదారులు ఏపీటీ సేవలు పొందేందుకు మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఐఎంపఏ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. వెంటనే ఐడీ నెంబరు వస్తుంది. ఆ నెంబరు ద్వారా రిజిస్టర్ పోస్టు, స్పీడ్ పోస్టు తదితర తపాలా సేవలను ఇంటి నుంచే పొందవచ్చు. పోస్టు చేయదలచిన పార్సిల్ అంచనా బరువు, సమీప పోస్టాఫీసు వివరాలను ఐఎంపఏ యాప్‌లో నమోదు చేస్తే సంబంధిత ప్రాంత పోస్టుమన్ ఇంటి వద్దకే వచ్చి పార్సిల్ తీసుకెళ్తాడు. బరువు ఆధారంగా చార్జీలు ఉంటాయి. సంబంధిత చార్జీలను వినియోగదారులు నగదు, యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. ఐఎంపఏ యాప్ ద్వారా ఏ సమయంలోనైనా పార్సిల్‌ను బుక్ చేసుకోవచ్చు. పికప్ మాత్రం పోస్టాఫీసు పనివేళల్లోనే ఉంటుంది. ఐఎంపఏ యాప్ నుంచే ఖాతాదారులు తపాలా సుకన్య సమృద్ధి యోజన, కిసాన్ వికాస్ పత్రాలు తదితర పొదుపు పథకాల్లో డిపాజిట్ చేసేందుకు కూడా వెలుసుబాటు కల్పించారు.

ఐఎంపఏ యాప్‌తో మరింత విస్తృతం



ప్రజలకు చేరువగా తపాలా సేవలు



ఆర్.నవీన్‌కుమార్, పోస్టల్ సూపరింటెండెంట్, అమలాపురం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

డివిజన్‌లోని అన్ని తపాలా కార్యాలయాలను అత్యాధునిక టెక్నాలజీతో అనుసంధానం చేశాం. ఇప్పటికే సేవలు ప్రారంభమయ్యాయి. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా మరిన్ని సేవలను అందించనున్నాం. ప్రైవేటు ఈ-కామర్స్ సంస్థలకు పోటీగా సరికొత్త టెక్నాలజీతో ఐడీసీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటికే కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ (ఐడీసీ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇకపై తపాలా శాఖ సొంత వాహనాల ద్వారానే పార్సిల్స్ సరఫరా చేసే విధంగా కేంద్ర తపాలా శాఖ చర్యలు చేపట్టింది. విదేశాలకు పంపించే పార్సిల్స్ సంఖ్య గతంలోకంటే పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, పీఎం కిసాన్ యోజన తదితర పథకాల నిధులను లబ్ధిదారులు గ్రామీణ ప్రాంతాల్లోని బ్రాంచి పోస్టాఫీసుల్లోనే పొందుతున్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ఎస్పీ బిందుమాధవ్.. హోంగార్డు నుంచి కానిస్టేబుల్స్‌గా ఎంపికైన 15 మందికి సత్కారం



కానిస్టేబుల్స్‌గా ఎంపికైన హోంగార్డులతో ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో చేరాలన్న జీవితాశయాన్ని సాధించేందుకు హోంగార్డుగా పనిచేస్తూ ఓ పక్క విధులు నిర్వర్తిస్తూ మరో పక్క కష్టపడి, పట్టుదలతో నెరవేర్చుకోవడం అభినందనీయమని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. సుదీర్ఘ కాలంగా హోంగార్డులుగా పని చేస్తూ పోలీస్ సెలక్షన్స్‌లో కానిస్టేబుల్స్‌గా ఎంపికైన 15 మందిని మంగళవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి, అంకితభావంతో పనిచేస్తే ఫలితాలు సానుకూలంగా వస్తాయన్నారు. శిక్షణలో వృత్తి నైపుణ్యాలను మరింత పెంచుకోవాలన్నారు. భవిష్యత్తులో మంచిస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కాగా తమకు చదువుకునేందుకు తగిన సమయం ఇవ్వడమే కాకుండా, శ్యామ్ ఇనిస్టిట్యూట్ నుంచి స్టడీ మెటీరియల్స్ తీసుకువచ్చి అందించి కానిస్టేబుల్స్‌గా ఎంపికవ్వడంలో ఎస్పీ కీలక పాత్రపోషించార న్నారు. ఆయన సేవలను జీవితంలో మరవలేమన్నారు. అనంతరం 15 మందిని ఎస్పీ అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఏఆర్ ఎస్.శ్రీనివాసరావు, డీఎస్పీ ఏఆర్ శ్రీహరి రావు, హోంగార్డు ఆర్ఐ ఎం.నరసింహమూర్తి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నకు ప్రత్యేక పూజలు

స్వామివారి ఆలయంలో రెండో రోజు వైభవంగా సాగిన పవిత్రోత్సవాలు



స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవా భాగంగా మంగళవారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. వసంత మండపంలో ఉత్సవ మూర్తులు కొలువుదీరారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రోక్షణ, పవిత్ర ప్రతిష్ఠ, ప్ర ధాన హోమాలు, అష్టకలశరాధన, మహాస్నపనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదమంత్రాల సాక్షిగా వైఖానస ఆగమ శాస్త్ర ప్ర కారం ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ప్రధాన హోమాలు, పవిత్ర ఆరోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తం గా నిర్వహించారు. ఉపకమిషనరు ఈవో నల్లం సూర్యచక్రధరరావు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆలయంలోని వసంత మండపంలో పవిత్రోత్సవ పూజలు నిర్వహిస్తున్న పండితులు

జనవాణి వినతుల స్వీకరణ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో మంగళవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో జనవాణి నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం, జీతాల పెంపుదల, ఉద్యోగ భద్రతపై ప్రజలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇచ్చిన వినతులను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ స్వీకరించారు. మహిళలు, వివిధ వర్గాల ప్రజలు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారుల తో ఎమ్మెల్యే నానాజీ మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.



కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

ఈ నెల 23 నుంచి ఉద్యోగులకు సీపీటీ పరీక్ష

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 340 మందికి నిర్వహణ

కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాట్లు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, అటెండర్లకు ఈ నెల 23, 24, 30 తేదీల్లో సీపీటీ (కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్) పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నోడల్ అధికారి షాన్‌మోహన్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. కాకినాడ, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న 340 మంది ఉద్యోగులకు కాకినాడ జేఎన్టీయూలో పరీక్ష జరగనుంది. ప్రభుత్వ ఉద్యోగులు కంప్యూటర్ పరిజ్ఞానం ఏ మేరకు ఆర్జించారో తెలుసుకునేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం

- టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్
- కాకినాడ కింగ్స్ క్రికెట్ జట్టు పరిచయ కార్యక్రమం
- వేడుకగా లోగో, జెర్సీ ఆవిష్కరణ



కాకినాడ కింగ్స్ లోగో ఆవిష్కరిస్తున్న జ్యోతుల నవీన్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. కాకినాడ గోదావరి కళాక్షేత్రంలో మంగళవారం ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)కు కాకినాడ కింగ్స్ క్రికెట్ జట్టు పరిచయ కార్యక్రమంతో పాటు లోగో, జెర్సీ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నవీన్ మాట్లాడుతూ గతంలో క్రీడాకారుల వయసు మీరినా అవకాశం వచ్చేది కాదని, ప్రస్తుతం ఉన్న వాళ్లకి ఏపీఎల్, ఐపీఎల్ అనే టోర్నమెంట్లు ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా ఒత్తిడి లేని విద్యను అభ్యసించి క్రీడల్లో రాణించాలన్నారు. కాకినాడ కింగ్స్ పేరుతో ఒక క్రికెట్ జట్టు ఏర్పాటు కావడం ఆనందదాయకమన్నారు. ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులకు సౌకర్యాలు కల్పిస్తామని రోటరీ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకినాడ కింగ్స్ ఫ్రాంచైజీ యజమానులు పుట్టా శరత్, అవినాష్, ఈవెంట్ ఆర్గనైజర్ కామిరెడ్డి రాజేష్, ఎల్.టిక్కు, బన్నీ, తోట సుబ్బారావు నాయుడు, కాకినాడ కింగ్స్ క్రికెట్ కెప్టెన్ భరత్ పాల్గొన్నారు.

ముగిసిన 'కింగ్స్' ప్రాక్టీస్

కాకినాడ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాల క్రీడా మైదానంలో ఐదు రోజులుగా చేస్తున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) కాకినాడ కింగ్స్ జట్టు ప్రాక్టీస్ మంగళవారం ముగిసిందని అసోసియేషన్ సెక్రటరీ వెంకటేష్ తెలిపారు. ప్రముఖ క్రికెటర్ కేఎస్ భరత్ సారథ్యంలో ఈ నెల 8 నుంచి విశాఖపట్నంలో జరగనున్న ఏపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు కాకినాడ కింగ్స్ జట్టు సన్నద్ధమైంది. ఏపీఎల్‌లో ఇప్పటి వరకు ఆరు టీమ్‌లు ఉండగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కృషితో కాకినాడ కింగ్స్ జట్టుకు ఏడో జట్టుగా ఎంట్రీ లభించింది.



బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న కాకినాడ కింగ్స్ కెప్టెన్ భరత్

కేళ.. భళా

- మార్కెట్‌కు 30 వేలు అరటి గెలలు
- 'కర్పూరం'కు పెరిగిన డిమాండ్
- ధర.. రూ.200 నుంచి రూ.500

రావులపాలెం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అంతరరాష్ట్ర అరటి మార్కెట్ యార్డుగా ఖ్యాతి గాంచిన రావులపాలెం అరటి మార్కెట్‌యార్డుకు మంగళవారం రికార్డుస్థాయిలో 30 వేలు అరటిగెలలు వచ్చాయి. ప్రతిరోజు స్థానిక అరటి మార్కెట్‌యార్డుకు రైతులు 10వేల నుంచి 12 వేల గెలలు తీసుకొస్తుంటారు. కాగా 30వేల అరటిగెలలు రైతులు తీసుకురావడంతో వ్యాపారులు, రైతులు అరటిలోడు, మోటార్‌సైకిళ్లతో మార్కెట్‌యార్డు ప్రాంతంతో పాటు సర్వీస్ రోడ్డు బయట పెద్దఎత్తున అరటి గెలలు దర్శనమిచ్చాయి. ఈ నెల 8న వరలక్ష్మీవ్రతం సందర్భంగా వ్యాపారులు కూడా ఇతర ప్రాంతాల నుంచి అరటి గెలలు కొనుగోలు చేసేందుకు మార్కెట్ యార్డుకు వస్తున్నారన్న సమాచారంతో రైతులు పెద్దఎత్తున అరటిగెలలను తీసుకువచ్చారు. నిన్నటి వరకూ కర్పూరరకం అరటిగెల రూ.150 నుంచి 300 వరకూ మాత్రమే పలికింది. శ్రావణ మాస పర్వదినాలలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన వరలక్ష్మీ వ్రతం సందర్భంగా కర్పూర రకానికి భారీగా డిమాండ్ పెరిగి రూ.200 నుంచి రూ.500 వరకూ గెల ధర పలకడంతో రైతులు ఆనందపడ్డారు. మార్కెట్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సెక్రటరీ ఐఎస్ రాజువర్మ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మార్కెట్‌కు గెలలు తీసుకొచ్చిన రైతులు

బెస్ట్ సహకార సంఘంగా దొమ్మేరు

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బెస్ట్ సహకార సంఘంగా దొమ్మేరు సొసైటీని ఎంపికచేసి అవార్డు అందజేశారు. ఈ నెల 4న విజయవాడలో ఆప్కాబ్ 62వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఉత్తమ పనితీరు కనబర్చిన సొసైటీలకు అవార్డులను అందజేశారు. దానిలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో అందించిన సేవలకు గాను దొమ్మేరు వ్యవసాయ సహకార సంఘానికి బెస్ట్ పీఏసీఎస్‌గా అవార్డును అందజేశారు. ఈ అవార్డును రాష్ట్ర సహకారశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, కార్యదర్శి కరిబండి ప్రసాద్ అందుకున్నారు. రూ.20 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను అందజేశారు.



పోషణ పిచికారీతో బహుళ ప్రయోజనాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త భువనేశ్వరి

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మల్బరీ తోటలకు పోషక విలువలు అవసరమని, ఇందుకు మొక్కలు కత్తిరించిన 25-30 రోజుల వ్యవధిలో ఒక లీటరు పోషణను 140 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సెంట్రల్ సిల్క్ బోర్డు పరిశోధనా విస్తరణ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భువనేశ్వరి పేర్కొన్నారు. దీని వల్ల భూమిలో లభించని పోషకాలను పోషణ ద్వారా మల్బరీ మొక్కలు గ్రహిస్తాయని, తద్వారా పట్టు పురుగుల పెంపకం లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మేరా రేషమ్-మేరా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టు రైతులకు పోషణ పిచికారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జి అసిస్టెంట్ సెరీకల్చర్ అధికారి కె.సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు, పట్టు రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు

- వాకపల్లికి, గజ్జెనపూడికి సరఫరా అయిన కుళ్లిపోయిన కోడిగుడ్లు
- ఇలాంటి తింటే రోగాల బారిన పడక తప్పదని లబ్ధిదారుల ఆవేదన



ప్రత్తిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడు అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా చేస్తున్నారు. దీంతో బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం ఎంతో సదుద్దేశ్యంతో అమలు చేస్తున్న పౌష్టికాహార పథకాన్ని అక్రమార్కులు నీరుగారుస్తున్నారు. మండలంలోని వాకపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి కాంట్రాక్టర్ సరఫరా చేసిన గుడ్లు కుళ్లిపోవడమే కాకుండా కలిగిపోయి పాడైపోయినవి లబ్ధిదారులకు అందజేశారు. దీంతో వీటిని వినియోగించలేని పరిస్థితి ఎదురైంది. ఈ గుడ్లను పౌష్టికాహారంగా తీసుకుంటే రోగాల బారిన పడక తప్పదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి గజ్జెనపూడిలోని తదితర అంగన్‌వాడీ కేంద్రాలకు కాంట్రాక్టర్ నాసిరకం గుడ్లు సరఫరా చేస్తున్నట్టు తెలుస్తుంది. ఐసీడీఎస్ అధికారులు తక్షణం నాణ్యమైన గుడ్లు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సరస్వతీదేవిగా వనదుర్గ

- రత్నగిరి క్షేత్రరక్షకి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు
- సారె సమర్పించిన అన్నవరం దేవస్థానం వేదపండితులు


సరస్వతీదేవి అలంకరణలో వనదుర్గ


వనదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న దేవస్థానం వేదపండితుల కుటుంబసభ్యులు

అన్నవరం, ఆగస్టు 5 (అన్నవరం): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గమ్మ ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం అమ్మవారు సరస్వతీ అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తకోటికి జ్ఞానాన్ని ప్రసాదించే సరస్వతిగా అనుగ్రహించారు. ఆలయంలో విశేషపూజలు, కుంకుమార్చనలు జరిగాయి. తొలిరోజు దేవస్థానం తరుపున ఈవో కుటుంబసభ్యులు సారె సమర్పించగా రెండోరోజు దేవస్థానం వేదపండితులు కుటుంబసభ్యులతో సారెను అందించగా అర్చకులు స్వీకరించి అమ్మవారి పాదాలచెంత ఉంచారు.

కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

జెండా ఊపి ప్రారంభించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానం వేదికగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని కలెక్టర్ షాన్‌మోహన్ ఆర్మీ అధికారులతో కలిసి మంగళవారం తెల్లవారుజామున జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20 వరకు జరిగే ర్యాలీ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల నుంచి సుమారు 10వేల మంది అభ్యర్థులు ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. శారీరక పరీక్షల్లో అర్హత సాధించిన వారికి బుధవారం మెడికల్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.


ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్


ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొన్న అభ్యర్థులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ క్లీనర్ మృతి


మరణించిన సయ్యద్ సాదిక్

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని కర్ణాటకకు చెందిన లారీ క్లీనర్ మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. వివరాల ప్రకారం.. కర్ణాటకలోని కొలార్ పట్టణంలోని రామత్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ రోషన్‌పాష, క్లీనర్ సయ్యద్ సాదిక్ జూలై 31న కెమికల్ లోడ్ వేసుకుని బెంగుళూరు నుంచి వైజాగ్ బయలుదేరారు. సోమవారం రాత్రి 7-15 గంటల సమయంలో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం గోవర్ధనగిరిమెట్ట వద్ద లారీని రోడ్డు పక్కన పార్క్ చేసి భోజనానికి దిగారు. క్లీనర్ సయ్యద్ సాదిక్(42) రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో సాదిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ సయ్యద్ రోషన్‌పాష అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు రూరల్ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు పేర్కొన్నారు..

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం... కుటుంబానికి శాపం!

- మృతుడి పేరుతో 17 విద్యుత్ కనెక్షన్లు
- రేషన్‌కార్డు దరఖాస్తులో బట్టబయలు
- అందని ప్రభుత్వ పథకాలు


దివ్యాంగ బాలుడు లిశాంత్‌రాజు


వద్దిపర్రుకు చెందిన అజ్జయ్య ఆధార్ నెంబరుతో 17 విద్యుత్ సర్వీసులు మంజూరు చేసిన దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన ఓ వ్యక్తి పేరు మీద 17 విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్టుగా ఆన్‌లైన్‌లో చూపించడంతో ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆ కుటుంబ సభ్యులు అర్హత కోల్పోగా విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వద్దిపర్రుకు చెందిన పల్లెకొండ అజ్జయ్య అనే దళిత వృద్ధుడు ఇటీవల మరణించాడు. అతడి కుమారుడు భీమరాజు ఓ ప్రవేట్ స్కూల్‌లో పనిచేస్తున్నాడు. అర్జయ్య భార్యతో పాటు కుమారుడు భీమరాజు, భార్య ఒకే రేషన్‌కార్డులో ఉన్నారు. భీమరాజుకు రెండేళ్ల బాలుడు లిశాంత్‌రాజ్ ఉన్నాడు. పుట్టుకతోనే బాలుడికి మెదడు పనిచేయకపోవడంతో మంచానికి పరిమితమయ్యాడు. లిశాంత్‌కు నూరుశాతం పర్సంటేజీతో సదరం సర్టిఫికెట్ వైద్యులు మంజూరు చేశారు. కుమారుడి పేరు రేషన్‌కార్డులో నమోదు చేసేందుకు తండ్రి భీమరాజు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసేందుకు వెళ్లగా మీ తండ్రి అర్జయ్య పేరు మీద 17 విద్యుత్ సర్వీసులు ఆన్‌లైన్‌లో ఉన్నట్టు చెప్పడంతో నిర్ఘాంతపోయాడు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాడు.

ఎక్కడ జరిగింది తప్పు...

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఓ దళిత కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందకుండా పోతున్నాయి. బాలుడికి దివ్యాంగ పింఛన్ వస్తే వైద్యానికి ఉపయోగపడుతుందని ఆ కుటుంబం భావిస్తుంది. 2018లో విద్యుత్ మీటర్లకు ఆధార్‌లింక్ అనుసంధానం చేశారు. విద్యుత్ మీటర్లు ఉన్న వ్యక్తుల ఆధార్ కార్డు ఇంటిపన్ను రశీదులు సేకరించారు. ఏపీ ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయానికి సిబ్బంది పంపించారు. నియోజకవర్గంలోని 4 మండలాల విద్యుత్ మీటర్లకు ఆధార్‌నెంబరుతో అనుసంధానం చేశారు. ఆధార్ లింక్ చేసే సమయంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు బలంగా ఏర్పడ్డాయి. కొంతమంది సిబ్బంది బినామి పేర్లతో ఆధార్‌లింక్ చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందక లబోదిబోమంటున్నారు.

హిజ్రాలపై బైండోవర్ కేసులు

తాళ్లరేవు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం నుంచి లచ్చిపాలెం వరకు 216 జాతీయ రహదారి పక్కన హిజ్రాల స్థావరాలపై కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ బృందం మంగళవారం దాడులు చేసింది. ఐదుగురు హిజ్రాలను పట్టుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని తాళ్లరేవు తహశీల్దారు కార్యాలయానికి పంపించారు. వారిపై తహశీల్దారు పి.త్రినాథరావు బైండోవర్ కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇచ్చి పూచీకత్తులతో పంపించారు.

తండ్రి మందలించాడని కుమార్తె అదృశ్యం

కేసు నమోదు

అమలాపురం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎక్కువగా ఫోన్ మాట్లాడుతున్న కుమార్తెను తండ్రి మందలించడంతో అలిగి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో అమలాపురం తాలూకా పోలీసులు మంగళవారం విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నారాయణపేటకు చెందిన ఆకుల విజయభాస్కర్ కుమార్తె లోహిత తన పెద్దమ్మ అయిన కొండ్రెడ్డి రామలక్ష్మి ఇంటి వద్ద ఉండి డిగ్రీ ప్రైవేటుగా చదువుతోంది. రామలక్ష్మి కామనగరువు శివారు బాలయోగి కాలనీలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చిన తండ్రి విజయభాస్కర్ ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడుతున్న కుమార్తె లోహితను మందలించాడు. దాంతో లోహిత మధ్యాహ్నా 3.30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. అన్నిచోట్లా గాలించి ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో విజయ్‌భాస్కర్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ మురళీమోహనకృష్ణ పేర్కొన్నారు.

శ్రీలంక సముద్ర జలాల్లో పట్టుబడిన కాకినాడ ఫైబర్ బోటు

నలుగురు మత్స్యకారుల అరెస్ట్

కాకినాడ సిటీ/ కె.గంగవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ఫైబర్ బోటును శ్రీలంక సముద్ర జలాల్లో సోమవారం రాత్రి గస్తీ సిబ్బంది పట్టుకున్నారు. స్థానిక జగన్నాథపురం పరదేశమ్మపేటకు చెందిన పంతాడి బ్రహ్మానందం కేరళలో రూ.40 లక్షలు పెట్టి ఫైబర్ బోటు కొనుగోలు చేసి కాకినాడ తీసుకువస్తుండగా ఈ ఘటన జరిగింది. రామేశ్వరం బ్రిడ్జి దిగువ నుంచి రావాల్సిన బోటు జీపీఎస్ సాంకేతిక లోపం వల్ల చుట్టుతిరిగి ప్రయాణిస్తూ శ్రీలంక సముద్ర జలాల్లోకి వెళ్లిపోయారు. దీంతో ఆ దేశ గస్తీ సిబ్బంది ఫైబర్ బోటు, అందులోని నలుగురు మత్స్యకారులను అదుపులోకి తీసుకుని ఇక్కడి మత్స్యశాఖ అధికారులకు సమాచారం తెలిపారు. అదుపులోకి తీసుకున్న మత్స్యకారుల్లో పంతాడి బ్రహ్మానందం, చింతా నాగేశ్వరరావు, కర్రి నూకరాజు, కొప్పాడి శ్రీను ఉన్నారు. వారిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జిల్లా అధికారులతో మాట్లాడారు. శ్రీలంకలో అరెస్టయిన మత్స్యకారుల్లో ఒకరైన కర్రి నాగరాజు అత్తగారి గ్రామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలోని మసకపల్లి. నాగరాజు అరెస్టుతో గ్రామంలోని వారి కుటుంబం ఆందోళనకు గురైంది. ఆందోళన చెందవద్దని సర్పంచ్ పల్లి అన్నపూర్ణ కళ్యాణ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. అరెస్టయిన నలుగురిని తిరిగి భారత్‌కు తీసుకువస్తామని మత్స్యకార సంఘం నాయకుడు కర్రి చిట్టిబాబు తెలిపారు. మంగళవారం ఆయన కోటిపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. దీనిపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ద్వారా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి శ్రీలంక అధికారులతో సంప్రదింపులు జరిపామని, త్వరలోనే వారిని దేశానికి తీసుకువస్తామని ఆయన చెప్పారు. ఆయా కుటుంబాలు వారు ఆందోళన చెందవద్దని కోరారు.


మసకపల్లిలో కర్రి నూకరాజు కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న సర్పంచ్

ఉత్కంఠభరితంగా...

కాకినాడలో ఐదో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు


కాకినాడలో హాకీ ఆడుతున్న ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా టీంలు


కర్ణాటక, జార్ఖండ్ టీంలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్‌షిప్-2025లో భాగంగా మంగళవారం ఐదోరోజు కాకినాడ క్రీడా మైదానం ఆస్ట్రోటర్ఫ్ ఫీల్డ్‌లోని 6 మ్యాచ్‌లు జరిగాయి. తమిళనాడు వర్సెస్ ఢిల్లీ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగి డ్రాగా ముగిసింది. మిగిలిన మ్యాచ్‌లు ఏకపక్షంగానే సాగాయి. మ్యాచ్‌లను రాష్ట్ర హాకీ సంఘ కార్యదర్శి హర్షవర్ధన్ ప్రారంభించారు. సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి, పి.తామస్ పీటర్, భవానిశంకర్ పర్యవేక్షించారు.

మ్యాచ్‌ల వివరాలు...

పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 11-0తో విజయం సాధించింది. తమిళనాడు, ఢిల్లీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3-3 స్కోర్ నమోదు కావడంతో డ్రాగా ముగిసింది. చండీఘడ్, మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 5-0తో విజయం సాధించింది. హర్యానా, బెంగాల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా 7-1తో విజయం సాధించింది. కర్ణాటక, జార్ఖండ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ 2-0తో విజయం సాధించింది. ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా 3-1 తేడాతో విజయం సాధించింది.

14న డిప్యూటీ సీఎం పవన్ రాక

పిఠాపురంలో పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన

హెలిప్యాడ్ పరిశీలించిన అధికారులు


గొల్లప్రోలులో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, అధికారులు

గొల్లప్రోలు/పిఠాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగే స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొనేందుకు ఈనెల 14వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లాకు రానున్నారు. గొల్లప్రోలులో హెలిప్యాడ్‌కు చేరుకుని అదే రోజు సాయంత్రం పిఠాపురంలోని అగ్రహారం వద్ద ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన చేస్తారు. అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం కాకినాడ బయలుదేరి వెళ్తారు. రాత్రికి కాకినాడలో బస చేసి 15న జరిగే స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొంటారు. పవన్ హెలికాప్టర్‌లో రానున్న నేపథ్యంలో గొల్లప్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని హెలిప్యాడ్‌ను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ఇతర పోలీసు అధికారులు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. హెలిప్యాడ్ పరిసరాలు, అక్కడ చేయాల్సిన బందోబస్తు ఏర్పాట్లు తదితర అంశాలను వారు పరిశీలించారు. ఆయన వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు. కాగా పిఠాపురంలో అగ్రహారం వద్ద ఏర్పాట్లను జిల్లా అడిషనల్ ఎస్పీ భాస్కరరావు పరిశీలించారు. అక్కడ చేయాల్సిన బందోబస్తు, రక్షణ ఏర్పాట్లుపై సూచనలు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

శంఖవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడి శివారు కాకినాడ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. రౌతులపూడి మండలం గిడజాం గ్రామానికి చెందిన ప్రవీణ్, విజయ్ కాకినాడ వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా పెట్రోలు బంక్ సమీపంలో లారీని తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారు. ప్రవీణ్‌కు కాలు విరిగిపోగా, విజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108లో పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

జగ్గంపేట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపూడి వద్ద అశోక్ లేలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్‌వోకు అందిన సమాచారం మేరకు ప్రత్తిపాడు డీటీసీఎస్ ఏలేశ్వరం నుంచి గోకవరం వెళ్తుండగా మార్గంమధ్యలో రాజపూడి వద్ద వాహనం ఆపి తనిఖీ చేసి సుమారు 3610 కిలోల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1,67,026 ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

లాడ్జిలో ఉరేసుకున్న వివాహిత

కొవ్వూరు/కొత్తపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): లాడ్జి రూములో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సమీపంలోని కుతుకుడుమిల్లి గ్రామానికి చెందిన కాసా శివాని (30) సోమవారం రాత్రి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో ఉన్న సాయిలక్ష్మి లాడ్జిలో దిగింది. మంగళవారం రాత్రి అయినా తలుపులు తెరవకపోవడంతో లాడ్జి సిబ్బంది అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ సీఐ విశ్వం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరవడంతో రూములో సీలింగ్ ఫ్యాన్‌కు మహిళ చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. లాడ్జిలో అందించిన ఫోన్ నంబరు ఆధారంగా మహిళ బంధువుల ఆచూకీ తెలుసుకుని మృతి విషయాన్ని తెలియజేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా శివాని కుటుంబ కలహాలతోనే విరక్తి చెంది ఉరి వేసుకుని ఉంటుందని సమాచారం.

గంజాయితో నలుగురి అరెస్ట్


గంజాయితో పట్టుబడిన నిందితులతో చింతూరు పోలీసులు

చింతూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు మంగళవారం నలుగురిని అరెస్ట్ చేసి 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రమేష్ కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నవీన్ కుమార్, బాకిరాజు, సుంకే అశోక్, చింతూరుకు చెందిన షేక్ అబ్బాస్ అలియాస్ తుర్రం మహేష్ ముఠాగా ఏర్పడి ఒడిస్సాలో 12 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. తదుపరి వయా చింతూరు మీదుగా తెలంగాణకు తరలించే యత్నంలో వాహన తనఖీల్లో భాగంగా అల్లూరి చింతూరు బస్‌స్టాండ్ వద్ద పోలీసులకు పట్టుపడ్డారు. రూ.60 వేలు విలువైన గంజాయితో పాటు నిందితులు వినియోగించిన 2 ద్విచక్ర వాహనాలు, 4 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

బొగ్గు లారీ బోల్తా

ప్రత్తిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మినర్వా కళాశాల సమీపంలో సుద్దగడ్డవాగు వంతెన వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం అదుపు తప్పి బొగ్గు లోడు లారీ బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.


ప్రత్తిపాడులో బోల్తా పడిన బొగ్గు లారీ

యర్రవరంలో జాతీయ పొల్యూషన్ బోర్డు కమిటీ సభ్యుల తనిఖీలు

ఏలేశ్వరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో ఉన్న అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం జాతీయ పొల్యూషన్ బోర్డు కమిటీ సభ్యులు తనిఖీలు చేశారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, శుద్ధి చేయని వ్యర్థ జలాలతో పొల్యూట్‌గా మారి చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని పెద్దనాపల్లికి చెందిన చిన్ని ఫిర్యాదు మేరకు జాయింట్ కమిటీ తనిఖీలకు వచ్చింది. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థ నీటిని పరిశ్రమ పరిధిలో సేకరించారు.


అవంతి పరిశ్రమ వ్యర్థ నీటిని సేకరిస్తున్న కమిటీ సభ్యులు

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన బొత్స జయప్రసాద్ దంపతులు మంగళవారం వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ10,116 విరాళాన్ని ఆలయ సిబ్బందికి అందించారు. వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ వారిని అభినందించారు.

క్రీడా సామగ్రి పంపిణీ

అమలాపురం టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అమలాపురం కామాక్షీ పీఠంలోని ప్రేమమందిరం చిన్నారులకు పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో మంగళవారం క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. అనంతరం వక్కలంక వాణి ఆధ్వర్యంలో సీఐ వీరబాబును చిన్నారులు సత్కరించారు. పట్టణ ఎస్‌ఐలు శ్రీనివాస్, కిశోర్‌బాబు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి

- సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలి
- వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా


ఈదరపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

అమలాపురంరూరల్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం ఈదరపల్లిలోని సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత ఈదరపల్లి వంతెన వద్ద నుంచి స్మార్ట్ మీటర్లపై పోరుబాట నిరసన ర్యాలీ నిర్వహించారు. సబ్‌స్టేషన్ ఎదుట చేపట్టిన ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) పాల్గొని మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలను విపరీతంగా మోపిందని, వాటిని తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడాన్ని ఆయన నిరసించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇది మీటరు మార్పు మాత్రమే కాదని విధాన మార్పు అని అన్నారు. విద్యుత్ పంపిణీని ప్రైవేటీకరణచేసి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్ర దాగిఉందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం నాయకుడు మామిడిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ శాఖ అధికారులకు అందించారు. తక్షణం స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని, సెకీ ఒప్పందాన్ని రద్దుచేయాలని నినాదాలు చేశారు. ప్రజాసంఘాల నాయకులు వాసంశెట్టి సత్తిరాజు, సకిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, నిమ్మకాయల వెంకటేష్, కె.శంకర్, ఊటాల వెంకటేష్, మోకా శ్రీనివాసరావు, గూడాల వెంకటరమణ, బొలిశెట్టి శంకర్ పాల్గొన్నారు.

పాత రైల్వేలైన్ ఎలైన్‌మెంట్‌ను కొనసాగించాలి

- కలెక్టరేట్ ఎదుట కొత్త రైల్వేలైన్ బాధితుల నిరసన


అమలాపురం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కొత్త రైల్వేలైన్ బాధితులు

అమలాపురం టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా భట్నవిల్లి నుంచి పేరూరు మీదుగా పాశర్లపూడి కి ప్రతిపాదించిన పాత రైల్వేలైన్ కొనసాగించాలని కోరుతూ పలువురు రైతులు, గృహ యజమానులు కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికే రైల్వేలైన్ నిమిత్తం భూసేకరణ కోసం సర్వే నంబర్లతో సహా మార్కింగ్ చేశారని సదరు ప్రతిపాదనను రైల్వేశాఖ ఆమోదించిందన్నారు. కొత్తగా రైల్వేలైన్ ప్రతిపాదన తెరపైకి రావడంతో తిరిగి మరోసారి నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వేలైన్‌కు సమాంతరంగా 216 జాతీయ రహదారి మూడు చోట్ల రైల్వేలైన్ క్రాసింగ్ వల్ల ఎన్‌హెచ్ అస్తవ్యస్తంగా మారుతుందని వివరించారు. కొత్తగా ప్రతిపాదించే రైల్వేలైన్ వల్ల నివాస గృహాలు నష్టపోవడంతో పాటు ఓఎన్జీసీ పైపులైన్లు, తాగునీటి పథకాలకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. కొత్త రైల్వేలైన్ ప్రతిపాదనపై పునఃపరిశీలనచేసి న్యాయం చేయాలని బాధిత రైతులు, గృహ యజమానులు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి అర్జీ అందించి తమ గోడును వివరించారు. కార్యక్రమంలో భట్నవిల్లి, కామనగరువు, చిందాడగరువు, రోళ్లపాలెం, పేరూరు, బోడసకుర్రు గ్రామాలకు చెందిన రంకిరెడ్డి సూర్యనారాయణ, అరవ గౌతమీపూర్ణచంద్రరావు, నంద్యాల నాయుడు, జక్కా నాగస్వామి, జక్కా మంగతాయారు, ఎస్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో రక్షణ మీ వెంటే: డీఎస్పీ


ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లేటప్పుడు ఆకతాయిలు వెంటపడి వేధిస్తే విద్యార్థినులు కన్నీళ్లు పెట్టుకోవడం పాత మాట.. శివంగిలా ఎదురుతిరిగి బుద్ధి చెప్పడం నేటిమాట.. విద్యార్థినిల్లోనే అనంతమైన శక్తి దాగి ఉంది. దానికితోడుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి శక్తి యాప్ ఉందని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే. ప్రసాద్ పేర్కొన్నారు. శక్తి యాప్ మీ వెంట ఉంటే రక్షణ మీ వెంటే అన్నారు. ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఎల్.రాణి అధ్యక్షతన మంగళవారం విద్యార్థినులకు శక్తియాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలకు రక్షణ కల్పించేందుకు శక్తియాప్ ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు, పిల్లలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు, గృహ హింస వేధింపుల నుంచి బయట పడేందుకు, మహిళల అక్రమ రవాణాను నిరోధించేందుకు శక్తియాప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. శక్తియాప్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థినులు, మహిళలు ఎస్‌వోఎస్ బటన్ నొక్కాగానే మీరు ప్రమాదంలో ఉన్న విషయం పోలీసు కంట్రోల్ రూముకు తెలుస్తుందన్నారు. మీ చరవాణి లోకేషన్‌ను గుర్తించి హుటాహుటిన పోలీసులు అక్కడకు చేరుకుని రక్షిస్తారన్నారు. అదేవిధంగా యాప్‌లోని 112 బటన్ నొక్కితే కంట్రోల్ రూమ్‌కు కాల్ వెళుతుందని చెప్పారు. ప్రయాణ సమయాల్లో సేఫ్ ట్రావెల్ ఆప్షన్‌ను ఉపయోగించుకోవాలని సోదాహరణంగా వివరించారు. అవగాహన సదస్సులో తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు, మహిళా ఎస్ఐ గంగాభవానీ, ఉపాధ్యాయులు గుబ్బల పెద్దిరాజు పాల్గొన్నారు.

8 నుంచి జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక

అమలాపురం టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు పది క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 8, 9 తేదీల్లో జిల్లా స్థాయిలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హాకీ, కబడ్డీ కోకో, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జోనల్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తారు. అండర్-22 పురుషులు, మహిళలకు ఈ పోటీలు జరుగుతాయి. జోనల్ స్థాయిలో ఈ నెల 11నుంచి 14వరకు, రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల16 నుంచి 20వరకు నిర్వహిస్తారన్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో స్థానిక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయ ప్రాంగణమైన జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఎంపికలు ఆయా క్రీడాంశాల్లో నిర్వహిస్తామన్నారు. పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దంటూ నిరసన



సఖినేటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సీపీఐ నాయకుల నిరసన

అంతర్వేది, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ఉన్న విద్యుత్ ఉప కేంద్రం వద్ద సీపీఐ నాయకులు మంగళవారం విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించ వద్దని ధర్నా చేశారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇప్పటికే ట్రూఅప్, సర్‌చార్జీల పేరుతో వినియోగదారులను దోపిడీ చేస్తున్నారని, ప్రీపెయిడ్ రీచార్జీ వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తక్షణమే విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపేయాలని, సర్దుబాటు చార్జీలను రద్దు చేసి విద్యుత్ చార్జీలను తగ్గించాలని తదితర డిమాండ్లతో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండలకార్యదర్శి గెడ్డం ప్రభాకరరావు, చెల్లుబోయిన తాతారావు, దొండపాటి భానోజీ, బళ్ల పెద్ద, పులివర్మ పాల్గొన్నారు.

తల్లి పాల ప్రాముఖ్యత తెలుసుకోండి

మలికిపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరూ తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో ఇందిర అన్నారు. మంగళవారం మోరిలో కె.జ్యోతి అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన తల్లిపాల వారోత్సవాల సభలో ఆమె మాట్లాడారు. ప్రసవం జరిగిన గంటలోపు ఇచ్చే పాలు వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటుందని, మొదటి టీకాగా పనిచేస్తుందన్నారు. సూపర్‌వైజర్ చంద్రకళ, అంగవాడీ కార్యకర్తలు ఎ.పద్మావతి, కొండా జ్యోతి, శేషవేణి, వరలక్ష్మి, సునీత, మహిళా పోలీసు ఝాన్సీ పాల్గొన్నారు.

పాశర్లపూడి ఓఎన్జీసీ బావిలో బాంబింగ్ ప్రజల ఆందోళన

మామిడికుదురు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి-పాశర్లపూడిలంక గ్రామాల మధ్య గల ఓఎన్జీసీ వద్ద సిబ్బంది బాంబింగ్ నిర్వహించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఇటీవల ఈ ఓఎన్జీసీ రిగ్ వద్ద గ్యాస్ కిక్ సంభవించడంతో ఆ సమయంలో ప్రజలు భయాందోళనలతో పరుగులు తీశారు. సంబంధిత అధికారులు కిక్‌ను అదుపు చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఓఎన్జీసీ బావి వద్ద ఈ-2003 రిగ్ ద్వారా డ్రిల్లింగ్ పనులు చేస్తున్నారు. డ్రిల్లింగ్‌లో భాగంగా మంగళవారం బాంబింగ్ చేస్తున్న సమయంలో ప్రకంపనలు ఏర్పడటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల గృహాలు కొద్దిపాటి బీటలు తీశాయని స్థానికులు పేర్కొంటున్నారు. ముందుగా సమాచారంఇచ్చి ఇటువంటి కార్యకలాపాలు నిర్వహిస్తే ప్రజలు భయాందోళనలు చెందకుండా ఉంటారని స్థానికులు పేర్కొంటున్నారు.

సృజనాత్మకత వెలికి తీసేలా బోధన చేయాలి


మాట్లాడుతున్న ఏపీడీ జి.మమ్మి

కాట్రేనికోన, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులో సృజనాత్మకత వెలికి తీసే విధంగా బోధన జరగాలని సమగ్ర శిక్షాభియాన్ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ పిలుపు నిచ్చారు. మగళవారం కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న లీడర్ షిప్ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు అత్యంత అవసరమన్నారు. పాఠశాలను సమర్థవంతంగా నిర్వహించడానికి శిక్షణా తరగులు ఉపయోగపడతాయన్నారు. ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలు పెంచేందుకు నాలుగు రోజులు ఆన్‌లైన్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ రెండు విడతల్లో 510మంది శిక్షణ పొందగా మూడో విడత 108మంది శిక్షణ పొందినట్లు వివరించారు. మాస్టర్ ఫెసిలిటేటర్స్ చిట్టినీడి నిరంజని, ఎస్.ముత్యాలరావు, ఎస్.శ్రీధర్‌కృష్ణ, ఎ.రామచంద్రరావు, విద్యాశాఖాధికారులు వైవీ వీ సత్యనారాయణ, పి.శ్రీనివాసు పాల్గొన్నారు.

'గురుకులం'లో స్పాట్ అడ్మిషన్లు

రాజోలు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శివకోటి గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 5, 6 తరగతులకు, జూనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు పాఠశాల కార్యాలయంలో ఈనెల7వ తేదీ ఉదయం 9నుంచి 4గంటల వరకు జరుగుతుందని ప్రిన్సిపాల్ టి.లలితకుమారి మంగళవారం తెలిపారు. వివరాలకు 9701856723, 6303190325 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

15లోపు ఈ పంట నమోదు చేసుకోవాలి

అంబాజీపేట, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఈనెల15వతేదీలోపు ఈపంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.ధర్మప్రసాద్ తెలిపారు. చిరతపూడిలో మంగళవారం సర్పంచ్ కోట బేబీరాణి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎరువుల యాజమా న్యం, పురుగు మందుల పిచికారిపై అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవలో ఇబ్బందులపై గ్రీవెన్స్, వ్యవసాయ అసిస్టెంట్లకు దరఖాస్తు ఇవ్వాలన్నారు. ఏఈవో శివమోహన్, వీఏఏ లలిత, చినబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు పండించేలా ప్రోత్సహించాలి

రాజోలు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు పండించే విధంగా ప్రోత్సహించాలని ఏవో పి.ప్రసన్నకుమార్ అన్నారు. కడలిలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజోలు డివిజన్ పరిధిలోని మూడు మండలాల ఆర్ఎస్కే సిబ్బంది, వీఏఏలు, వీహెచ్ఏలకు రెండో రోజు ట్రైనింగ్‌లో భాగంగా మంగళవారం ఏ-గ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్ శాశ్వత ద్రవ జీవామృతం ట్యాంకు ఉపయోగాల గురించి వివరించారు. రైతులు ఆకుకూరలు, కాయగూరలు, అరటి మొదలగు పంటల వల్ల అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఆదినారాయణ, బాబూరావు, జోసఫ్‌రాజ్, నాగబాబు, సురేష్, శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం


సమావేశంలో మాట్లాడుతున్న అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు

అమలాపురం టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై మంగళవారం అమలాపురం అర్బన్ డెవలెప్మెంట్ అథారిటీ కార్యాలయంలో లైసెన్స్ సర్వేయర్లు, ఇంజనీర్లకు స్వామినాయుడు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ప్లానింగ్ ఆఫీసర్ ఎ.సత్యమూర్తి, ఎల్ఆర్ఎస్ పథకంపై అవగాహన కల్పిస్తూ ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. అముడా పరిధిలో అనధికార లేఅవుట్లు ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఇందుకోసం అక్టోబరు 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ పి.ఉమామహేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

మురుగు కూపం తొలగించారు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మురుగు కూపాన్ని ఇసుకతో పూడ్చిన దృశ్యం

ఐ.పోలవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయం చెంత ఉన్న మురుగు కూపాన్ని తొలగించారు. ఎంపీడీవో కార్యాలయం చెంతన మురుగు కూపం శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఆ ప్రాంతాన్ని తువ్వ ఇసుకతో పూడ్చి మురుగు కూపాన్ని తొలగించారు. నిత్యం పనుల కోసం వచ్చే ప్రజలు మురగు కూపం తొలగించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి: అడబాల

అంబాజీపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అన్నారు. పుల్లేటికుర్రులో పార్టీ మండల ఇన్‌చార్జ్ కముజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బూత్ కమిటీలను నియమించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, జిల్లా పూర్వ ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణ, నాయకులు అయ్యగారి కృష్ణసుందర్, అధ్యక్షులు ఎస్.సాదిక్, కోటే శివాజీ, సుబ్రహ్మణ్యం, కాళ్ళ నాగమల్లేశ్వరరావు, బిళ్ల వెంకటలక్ష్మి, ఆకెళ్ళ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అంతర్వేది, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వీవీమెరక కంతేటివారిపోడుకు చెందిన మేడిది ఏసయ్య, రోడ్డు ప్రమాదంలో గాయపడిన మోరి గ్రామానికి చెందిన అడబాల నరేంద్రకు హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రూ.10వేలు అందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు వేమన శివాజీ తన మనుమడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా వారి ఇద్దరికి వైద్య ఖర్చుల కోసం సహాయం అందించినట్టు తెలిపారు. గెడ్డం విజయమోహన్, రాపాక ఆదామ్‌ప్రసాద్, రాపాక చిన్నీ, నల్లి ప్రసాదరావు, నల్లి మోహన్, కంకిపాటి ఏసురాజు పాల్గొన్నారు.

ఐస్ బాక్స్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

యానాం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): యానాం మత్స్యశాఖ ఆధీనంలోని చేపల విక్రయదారులకు (చేపల అమ్మకం చేయు స్త్రీ, పురుషులకు)ఐస్‌బాక్స్‌లు తీసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని యానాం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రకటనలో తెలిపారు. యానాం మార్కెట్ చేపల వర్తకసంఘం సభ్యులు అర్హులన్నారు. యానాం మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు ఫారం తీసుకుని ఈనెల 20వ తేదీలోగా అందజేయాలన్నారు.

కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారికి సన్మానం



అమలాపురం టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీవీసీ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొంది పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికైన 11మంది అభ్యర్థులను డైరెక్టర్ రత్నప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ సమక్షంలో సత్కరించి అభినందించారు.

కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

యానాం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతీ ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని అధికా రులు సూచించిన నేపథ్యంలో యానాంలో మరిన్ని పీఎస్‌సీ సెంటర్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షుడు ఆర్ధాని దినేష్ కోరారు. ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి, మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్‌కి ఆయన వినతిపత్రం అందజేశారు. యానాంలో ఐదు కామన్ సర్వీస్ సెంటర్లు మాత్రమే ఉన్నాయని, సావిత్రి నగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, కనకాలపేట ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ప్రాంతాల్లో సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు రాష్ట్ర స్థాయి కోకో రైతుల సదస్సు

అంబాజీపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట కోప్రా మర్చంట్స్ హాల్‌లో రాష్ట్ర స్థాయి కోకో రైతుల సమావేశం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తామని జిల్లా సహాయ కార్యదర్శి కొప్పిశెట్టి ఆనందవెంకటప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో కోకో ధరలు, రైతుల సమస్యలపై చర్చిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్‌పీవో ఏర్పాటుకు అవగాహన కల్పిస్తూ మన జిల్లాలోని కోకో రైతులను సభ్యులుగా చేయాలని, అన్‌సీజన్ బీన్స్‌కి రూ.500 తగ్గకుండా ధర నిర్ణయించాలని, ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తామన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

మామిడికుదురు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలోని కృష్ణశర్మ కాలనీ ప్రాంతంలో తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటింటికీ కుళాయి లైనువేసి తాగునీరు ఇవ్వడం మర్చిపోయారని ఆరోపించారు. తాగునీరు లేక సుదూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రాంత తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేనిచో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో తాగునీటి సమస్యను తీరుస్తామని ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని ఆరోపణలు చేశారు. వెంటనే కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

డీఏలు విడుదల చేయాలి

రాజోలు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, డీఏలు వెంటనే విడుదల చేయాలని జిల్లా సంఘం ఏపీజీఈఏ జిల్లా సంఘం కోశాధికారి జె.రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజోలు పెన్షనర్ల కార్యాలయంలో అధ్యక్షుడు టి.శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జరిగిన రాజోలు తాలూకా యూనిట్ ఏపీజీఈఏ కార్యవర్గసమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలను పరిష్కరించుకునే దిశగా ఉద్యోగులందరూ సన్నద్ధం కావాలన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

'మద్యం సేవించి వాహనాలు నడపరాదు'

రాజోలు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లుమద్యం సేవించి వాహనాలు నడపరాదని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ అన్నారు. విద్యార్థులను పాఠశాలలకు తీసుకువెళ్తున్న వాహనాల డ్రైవర్లకు మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో ఎన్.మనోహరం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ప్రతీ ఏడాది వేసవి సెలవుల్లో పాఠశాల వాహనాలను బ్రేక్‌డౌన్‌చేసి ఆర్టీవో ప్రమాణాలను తప్పకుండా పాటించాలన్నారు. వాహన డ్రైవర్లతో రోడ్డు భద్రత నిబంధనలపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్య అధ్యక్షుడు తాటికాయల అయ్యప్పనాయుడు, స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.గణేష్ పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ

పి.గన్నవరం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై పి.గన్నవరంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక గ్రేస్ డిగ్రీ కళాశాల నుంచి పి.గన్నవరం ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఆయా సచివాలయాల పరిధిలో ర్యాలీలు నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ బొండాడ నాగమణి, కార్యదర్శి నిమ్మకాయల వెంకటసత్యనారాయణ, ఏవో శర్మ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): చింతపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజల చేతిలో ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని. ప్రజలకు పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కె.రజనీ, పిప్పళ్ల మల్లు, మట్టా సురేష్‌కుమార్, వీఆర్వోలు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు సాయం

పి.గన్నవరం,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం గురుకుల పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయుడు, విజయానంద్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు అధ్యక్షుడు కత్తుల ఆనందరావు రూ.31 వేలు విలువైన ఇన్వర్టర్‌ను మంగళవారం వైస్‌ప్రిన్సి పాల్ శాస్త్రికి అందించారు. ఆనందరావుకు ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ నేలపూడి సత్యనారాయణ, కమిటీ చైర్మన్ సికిలే ప్రభాకరరావు, ఉపాధ్యాయులు జేవీ రమణ, కిరణ్మయి, కె.వెంకటేశ్వరరావు, సీహెచ్ రవిశంకర్, టీఎం రాజకుమార్, మహేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

మలికిపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల డిమాండ్ డే సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు రాజోలు నియోజకవర్గ జర్నలిస్టులు వినతిపత్రం అందించారు. నూతన అక్రిడిటేషన్లు వెంటనే ఇవ్వాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ప్రమాద పాలసీ అమలు చేయాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందించారు. పి.రామకృష్ణ, దివి నాయుడు, రాజశేఖర్, స్వామి, తోట సత్యనారాయణ, వీఎస్ఆర్ బాబ్జి, నాగశ్రీను, సురేంద్ర పాల్గొన్నారు.

రుద్రాభిషేక మహోత్సవం

ముమ్మిడివరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కొత్తలంకలోని శ్రీ పార్వతీ సమేత బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం 109రుద్రాభిషేక సంకల్పంతో అభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి, నందీశ్వరునికి పలు రకాల పండ్ల రసాలు, చెరుకు రసంతో విశేషంగా అభిషేకించి పూలతో అలంకరించారు. ఆలయ అర్చకులు శ్రీకంఠం ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఉండ్రాజవరం మండలం వెలగదుర్రుకు చెందిన ముదునూరి సతీష్‌వర్మ, పుష్పవతి దంపతులు రూ.1.16లక్షల విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.4.10 లక్షలు లభించిన్నట్లు ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

విద్యుత్ చార్జీల దోపిడీపై ప్రజా సంఘాల ధర్నా


మెయిన్ రోడ్డులో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయడంతో పాటు, విద్యుత్ చార్జీల దోపిడీ ఆపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండు చేశారు. మంగళవారం మెయిన్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు, ట్రూ అప్ చార్జీలను వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా నాయకులు వుండవిల్లి గోపాలరావు, సీఐటీయు జిల్లా కార్యదర్శి నూకల బలరాం, పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ, ఏఐకెఎంఎస్ నాయకులు వి.భీమశంకరం, ఎ.కృష్ణ, సీఐటీయు నాయకులు సత్తిబాబు, నాగరాజు, ఏఐటీయుసీ నాయకులు జి.రాజు, బి.సత్యనారాయణ, ఎం.గోపి, ఎస్‌వీవీ సత్యనారాయణ, మహిళా సమాఖ్య నాయకులు ఎస్.శారదాదేవి, వై.నాగమణి, ప్రజా నాట్యమండలి నాయకులు ప్రేమానందం, వి.రాంబాబు, కె.చంద్రరావు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





రాయవరం హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్. పక్క చిత్రంలో కపిలేశ్వరపురంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరీష్‌కుమార్

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

రాయవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డ్రగ్స్ వద్దు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ డి.సురేష్ బాబు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైం, శక్తియాప్‌పై ఎస్ఐ అవగాహన కల్పించారు. విద్యార్థినులను తమ సమస్యలపై శక్తియాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ మాధవరెడ్డి, పీసీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికిపోవద్దు

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని అంగర ఎస్ఐ హరీష్‌కుమార్ అన్నారు. మంగళవారం కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పలు అంశాలపై ఆయన విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలు, మహిళల భద్రత తదితర వాటిపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది, శక్తి టీం మహిళా కానిస్టేబుల్ విజయలక్ష్మి, కానిస్టేబుల్ సత్యనారాయణ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏపీయుడబ్ల్యుజే ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. తొలుత నియోజకవర్గ ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాకు చెందిన జర్నలిస్టులు ప్రదర్శన జరిపి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పనిచేసే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వారికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని ఏపీజేడబ్ల్యు ఆధ్వర్యంలో మంగళవారం మండపేటలో జర్నలిస్టులు ఆందోళన చేశారు. అనంతరం వారు మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు టీ.రామకృష్ణ తదితరులతో పాటు పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కె.గంగవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 3న రామచంద్రపురంలో జరిగిన అంతర జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో కుందూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్ 14 విభాగంలో ట్రైఅథెలాన్‌లో ఏలో జి.కార్తీక్ ద్వితీయస్థానం, ఎస్.హేమ తృతీయ స్థానం, అండర్ 16 లాంగ్‌జంప్, హైజంప్‌లో జి. కుందన లక్ష్మీప్రియ ప్రథమస్థానం, జావెలిన్ త్రోలో సుంకర అనురాధ ప్రథమ స్థానం, షాట్‌పుట్‌లో కె.ఉమారామవెంకట్ తృతీయ స్థానంలో నిలిచారు. వీరు ఈనెల 9, 10, 11 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతలపూడి ఆదినారాయణమూర్తి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పంపన సత్యానందం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి వెంకట సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ జగతా రమణ, గ్రామస్తులు పల్ల చినబాబు, పామర్తి బాబి, తాడి హరికృష్ణ, బత్తుల అప్పారావు, సిర్రా సురేష్, మేడిశెట్టి బాబి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా సాగుదాం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ కోరారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉద్యోగులారా రండి టీతాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. డిమాండ్ల సాధనకు అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలని లేనిపక్షంలో డిమాండ్లు సాధించుకోలేమన్నారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షులు శ్రీమన్నారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.సుబ్బలక్ష్మి, కార్యదర్శి పైడిమల్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్ సూర్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు, ఆర్ఐ వి.సత్యప్రసాద్ చేతుల మీదుగా పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు.

టింబర్స్ అసోసియేషన్ సమావేశం

రావులపాలెం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని టింబర్, బెంబో, సామిల్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టింబర్ బెంబో సామిల్ మర్చంట్ కలప వర్తకుల సమావేశం జిల్లా గౌరవ అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ప్రజలు కర్రగుమ్మాలు తగ్గించి యూపీసీ, సిమెంట్, గ్రానైట్ గుమ్మాలు పెట్టుకోవడంతో వ్యాపారం తగ్గిందని వక్తలన్నారు. అనంతరం జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.గణేష్, టింబర్ యార్డు గౌరవ అధ్యక్షుడు తెల్లా సుబ్బారావు, ఉపాధ్యక్షులు యన్నం రామారావు చౌదరి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ డి.రామకృష్ణ, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మారినీడి సత్య అర్జునరావు, స్టేట్ సెక్రటరీ తోటకూర వెంకటరమణరావు తదితరులు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో చిర్ల కనికిరెడ్డి, వి.శ్రీనివాస్, ఎం.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన వైద్య, ఆరోగ్య సిబ్బందికి సన్మానం

కపిలేశ్వరపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీ నుంచి ఇటీవల బదిలీపై వెళ్ళిన వైద్య, ఆరోగ్య సిబ్బందికి మంగళవారం సన్మానం జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి అధ్యక్షతన పీహెచ్‌సీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్ళిన సిబ్బంది బి.శ్యామలారాణి, పి.ఝాన్సీబాయ్, ఎం.దేవీ, జీవీవీ లక్ష్మి, ఏఎన్ఎం గ్రేడ్ -3 నుంచి ఎంపీహెచ్ఎ(ఎఫ్) గా పదోన్నతి పొందిన పి.శిరోమణి, సీహెచ్ దుర్గ, సీహెచ్ దేవిలను సత్కరించారు. పీహెచ్‌సీ పరిధిలో వారు చేసిన సేవల పట్ల వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో జె.మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు, హెచ్‌వీ మేరీమణి, హెచ్ఎస్ నానిబాబు, ల్యాబ్ టెక్నిషియన్ అలీ, స్టాఫ్ నర్సు బంగారు పాప, ఫార్మాసిస్ట్ ప్రిస్కిల్లా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుశీల, సుజాత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి కల్పించాలని వినతిపత్రం

కె.గంగవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న డ్రైవరు, వాచ్‌మెన్, అటెండర్లు, వీఆర్వో పోస్టులలో వీఆర్ఏలను పదోన్నతులపై నియమించాలని మండలంలోని వీఆర్ఏలు తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం నాయకులు కె.పూసలరావు, సీహెచ్ బాలు తదితరులు పాల్గొన్నారు.





ఆత్రేయపురం మండలం తాడిపూడిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో ఆలమూరు మండలం చింతలూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రాజు



కపిలేశ్వరపురం మండలం అంగరలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వాట్సాప్ గవర్నెన్స్‌తో ఎన్నో సౌకర్యాలు

ఆయా ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు ప్రజలకు చేసి చూపించిన అధికారులు

ఆత్రేయపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వాట్సప్ గవర్నర్స్ ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. ఆయా పంచాయతీల వద్ద సర్పంచ్‌లు, కార్యదర్శులు, ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చిన్నబ్బులు, పరిపాలన అధికారి రామస్వరూప్, సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.మోహన్, ఉపసర్పంచ్ యర్రా వీరన్నబాబు, ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, పడమరఖండ్రిక సహకార సొసైటీ చైర్మన్ పుత్సల శ్రీనివాస్, జనసేన నాయకులు, పిల్లా బసవరాజు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 9552300009 మొబైల్ నంబరుతో 200కి పైగా సేవలు పొందవచ్చన్నారు. వీటి సేవలపై ప్రజలకు వారు అవగాహన కల్పించారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): ప్రజల చేతిలో ప్రభుత్వం నినాదంతో వాట్సాప్ ద్వారా అనేక సేవలు అందిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆలమూరు మండలం చింతలూరు, పెదపళ్లలో మంగళవారం వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించారు. ప్రజలకు అవసరమైన చాలా సేవలు ఇందులో ఉన్నాయని వీటిని ఇంటి వద్ద నుంచే పొందవచ్చని ఎంపీడీవో రాజు తెలిపారు. వాట్సాప్‌ను ఉపయోగించే విధానాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్‌తో ఎన్నో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయని కూటమి నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ కార్యక్రమంపై ద్రాక్షారామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం సర్పంచ్ కొత్తపల్లి అరుణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎంపీడీవో పద్మజ్యోతి మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందవచ్చన్నారు. అనంతరం సచివాలయం నుంచి యానాం సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, జనసేన నాయకుడు సంపత్, జగతా వెంకట రమణ, కంచుమర్తి బాబూరావు అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ సిబ్బంది,



ద్రాక్షారామలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వివరిస్తూ ర్యాలీ

ఉత్తమ సహకార సంఘంగా వెలగతోడు

మండపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వెలగతోడు సహకార సంఘం జిల్లాస్థాయిలో 2024-25వ ఆర్థిక సంవత్సరానికిగాను ఉత్తమ సహకార సంఘంగా ఎంపికైంది. జిల్లా నుంచి ఎంపికైన ఏకైక సహకార సంఘం కావటంతో విజయవాడలో ఆప్కాబ్ 62వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి వంకా రామకృష్ణ, మంత్రి అచ్చెంనాయుడు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు నుంచి అవార్డుతోపాటు రూ.20వేల నగదు పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన సహకార బ్యాంకు జిల్లా అధ్యక్షుడు తమ్మల బాబు, డీసీసీబీ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పేరవరం వద్ద పైపులైన్‌కు లీకేజీ

తాగునీరు వృధా

ఆత్రేయపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరవరం పిరమిడ్ సమీపంలోని పుంత వద్ద రోడ్డు చెంతనే తాగునీరు అందించే ప్రధాన పైపులైన్ పగిలి శుద్ధి చేసిన జలాలు వృధాగా పోతున్నాయి. లక్షలాది రూపాయలతో నిర్మించిన పైపులైన్లకు తరచూ లీకేజీలు ఏర్పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గోదావరి జలాలను శుద్ధిచేసి 17 గ్రామాలకు అందించాలనే లక్ష్యంతో బొబ్బర్లంక వద్ద మెగా వాటర్ ప్రాజెక్టును నిర్మించారు. పైపులైన్లకు అనుసంధానంగా ఉచ్చిలి వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. తరచూ పైపులైన్లు పగిలిపోవడంతో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

సంతాపం

మండపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు, కాపు సంఘ నాయకుడు బండారు రామచంద్రరావు మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్

పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి

కె.గంగవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్ వీఆర్‌వోలను ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. 33, 34 ఫసలీలతో పాటు పాత బకాయిలు వసూలు చేయాలని చెప్పారు. రీ సర్వే కారణంగా ఇప్పటి వరకూ బకాయిలు ఉండిపోయినవి వాటిని ఇప్పుడు పూర్తి చేయాలని సూచించారు. పాస్‌బుక్ ఖాతాకు ఆధార్ లింక్ చేయించేలా రైతులకు అవగాహన కలిగించాలని చెప్పారు. తప్పుడు ఆధార్ లింక్ అయితే ప్రభుత్వ రాయితీలు రావనే విషయం రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఐ వెంకట్రావు, డిప్యూటీ తహసీల్దార్ మురళీ, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలి

ద్రాక్షారామ, ఆగస్టు 5(ఆంధ్ర జ్యోతి): ఆలయాలకు ధర్మకర్తలుగా నియమితులవడం దైవానుగ్రహమని వక్తలన్నారు. ఆలయాల అభివృద్ధి, ధర్మ పరిరక్షణకు వారు సేవకులుగా ఉండాలని టీడీపీ నాయకుడు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నా రు. మంగళవారం నరసాపురపుపేటలో ఉన్న భవానీ శంకరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ టేకుమూడి వెంకటరమణ, ధర్మకర్తలను వాసంశెట్టి సత్యం సత్కరించారు. ముందుగా ధర్మకర్తల మండలి సభ్యులతో ఈవో ఎస్.సత్యనారాయణ పదవీ ప్రమాణ స్వీకారం, రహస్య ప్రమాణం చేయించారు. అనంతరం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా టేకుమూడి వెంకటరమణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.శ్రీనివాస్, అర్చకులు ఎం.శ్రీనివాస దత్తు, సర్పంచ్ చాట్రాది వీరలక్ష్మి, ఎంపీటీసీ పడమటి జ్ఞానలక్ష్మి, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మీనవల్లి దొరబాబు, టీడీపీ నాయకులు చుండ్రు సూరిబాబు, కె.సత్తిబాబు తదితరులతో పాటు టీడీపీ కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

తల్లిపాలలో సంపూర్ణ పోషకాలు

రాయవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిపాలలో సంపూర్ణ పోషకాలు ఉన్నాయని ఐసీడీఎస్ మాచవరం, చెల్లూరు సెక్టార్ల సూపర్‌వైజర్లు బి.ఈశ్వరి, విష్ణుకుమారి అన్నారు. మంగళవారం మాచవరం, చెల్లూరు సెక్టార్ల పరిధిలో సోమేశ్వరం, చెల్లూరులో గ్రామాల్లో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. చెల్లూరులో సర్పంచ్ పాలిక రాఘవ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంలో సమానం అన్నారు. అనంతరం చెల్లూరు, సోమేశ్వరం గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించడంతో పాటు ఇంటింటికి వెళ్లి తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.


సోమేశ్వరంలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

కొత్తపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కొత్తపేట ఏడీఏ ఎం.వెంకటరామారావు కోరారు. మంగళవారం యెలిశెట్టివారిపాలెంలో ఆర్ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు, వీఏఏ, వీహెచ్‌ఏలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు కె.ద్వారకదేవి, ఎస్.లక్ష్మీలావణ్య, జె.భార్గవ మహేష్, హార్టీకల్చర్ అధికారి కోటేశ్వరరావు, జి.తిరుమల, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


ఆర్ఎస్‌కే సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

విద్యుత్‌శాఖ ఏఈ నాగేశ్వరరావు మృతికి సంతాపం

రావులపాలెం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఈతకోట సబ్‌స్టేషన్ పరిధి ఏఈగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ నాగేశ్వరరావు అకస్మికంగా మృతి చెందారు. మంగళవారం ఇంటి వద్ద గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు. విద్యుత్ శాఖ ఉద్యోగులతో పాటు పలువురు సంతాపం తెలిపారు.

జనార్దనస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా రాంబాబు

ఆలమూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోని నవజనార్ధనస్వామి ఆలయ నూతన పాలకవర్గం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన పాలకవర్గ అధ్యక్షుడిగా జనసేన పార్టీకి బైరిశెట్టి రాంబాబును నియమించారు. కార్యవర్గ సభ్యులుగా అయినవిల్లి వీరవెంకటసత్యనారాయణమూర్తి, కట్టా శ్రీనివాస్, ద్విభాష్యం సత్యలక్ష్మి, చిన్నం సుబ్బలక్ష్మి, సబ్బవరపు రామాయమ్మ, బొబ్బా రాంబాబు, కొప్పాడి జయబాబు, దారా దుర్గాభవానీలతోపాటు ఎక్స్‌అఫిషియా సభ్యునిగా ఆలయ అర్చకులు ఖండవల్లి సత్యప్రభాకరచార్యులును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతన పాలకవర్గ అధ్యక్షుడు రాంబాబుతోపాటు పాలకవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

ఆర్వో ప్లాంటుకు నిధులు మంజూరు

ఆలమూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) సూర్యారావుపేటలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయడానికి ఓఎన్జీసీ రూ.10లక్షల నిధులు కేటాయించింది. దీంతో ప్లాంటు నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాలనే లక్ష్యంతో ఓఎన్జీసీ ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసిందని ఆసంస్థ ప్రతినిధులు తెలిపారు. శంకుస్థాపనలో సర్పంచ్ చింతపల్లి వెంకటలక్ష్మి, కూటమి నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, ఈదల నల్లబాబు, కాలా సాయిబాబు, సంగిత సుబాష్, కాలా జయబాబు తదితరులతో పాటు స్నేహిత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడికి సన్మానం

కపిలేశ్వరపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అంగర గ్రామానికి చెందిన బళ్ళ నవజీవన్‌రాజేష్ కుమార్ లైన్‌మెన్ గా పనిచేస్తూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు సన్మానం అందుకున్నారు. ప్రేమస్ఫూర్తి సహాయ పరిచర్య ద్వారా చేస్తున్న బ్లడ్ డొనేషన్ క్యాంపు, ఐ క్యాంపు, మండపేటలో రహదారి వెంబడి ఉన్న పలువురు వృద్ధులకు రోజూ భోజన పంపిణీతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆయన్ను ఇటీవల కాకినాడలో జరిగిన శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సమితి యానివర్సరీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆ సంస్థ డైరెక్టర్ సతీష్ సన్మానించి మెమెంటో అందజేసారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్‌ను మంగళవారం పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం

రాయవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తిరుమల దర్శనానికి వెళ్లిన మహిళ ఇంట్లో చోరీకి యత్నించిన ఘటన రాయవరంలో చోటు చేసుకుంది. రాయవరం రెడ్ల రామాలయం వీధిలో ఉంటున్న గ్రంధి వీర రాఘవ ఈనెల 1న ఇంటికి తాళం వేసి కుమార్తెతో కలిసి తిరుమల వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకోగా ఇంటి తలుపు గడియ విరగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా తలుపులు, గడియలు ధ్వంసం చేసి దుండగుడు చోరీకి యత్నించినట్టు తెలుసుకున్నారు. ఇంట్లోని వస్తువులు చోరీకి గురి కాలేదని వారు తెలిపారు. చోరీ ఘటనపై బాధితురాలు రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సుబ్రహ్మణ్య కాంప్లెక్స్ నిర్మాణం ఫిర్యాదుపై విచారణ చేస్తున్న రామచంద్రపురం డీఎల్‌డీవో విజయలక్ష్మి

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై విచారణ

మండపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి పంచాయతీలో నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వర దుకాణ సముదాయాల నిర్మాణంపై రామచంద్రపురం డీఎల్‌డీవో వానపల్లి విజయలక్ష్మి మంగళవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపారు. సుబ్రహ్మణ్యేశ్వర షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణాన్ని ఆమె డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఆకులు వీవీ రమణలతో కలిసి అమె పరిశీలించారు. పంచాయతీలో దుకాణాలకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. ఆమె విచారణకు అప్పట్లో ఇక్కడ పనిచేసిన పంచాయతీ సిబ్బంది హాజరయ్యారు. తమ విచారణలో వెల్లడైన విషయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఆమె చెప్పారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేసిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మండల డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఏవీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.